మహిళకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయలు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఉద్యోగాలు ఊడగొడుతున్న బిజెపి సర్కార్

- ప్రభుత్వరంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు ధారాదత్తం
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ విక్రయించి.. ఉన్న ఉద్యోగాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం ఊడగొడుతోందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అన్ని వర్గాల కోసం బిఆర్‌ఎస్ కృషి చేస్తుంటే.. బిజెపి మాత్రం కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ పేదలపై పన్నులు వేసి భారం మోపుతోందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్కల్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. జహీరాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మాజీ మంత్రి ఫరీదుద్దీన్ పేరును మంత్రి ప్రతిపాదించారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్‌లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కోహిర్ మండలానికి సంబంధించిన రూ.46.25 కోట్ల స్వయం సహాయక చెక్కులను అందజేశారు. ఝరాసంగం మండలంలోని కెజిబివిలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. అలాగే, ఎన్నో ఏళ్లుగా పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న బీడకన్నె రైతులకు పట్టా పాసు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం పేదలపై భారాలు మోపి.. పెద్దలకు దోచి పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అప్పనంగా కార్పొరేట్లకు ఎర్రతివాచీ పరిచి కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థను విక్రయించడంతో 50 వేల మంది కార్మికులు వీధిన పడ్డారని గుర్తు చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్న కర్ణాటక, యుపి మిగతా రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాల ప్రజల దుస్థితి ఎలా ఉందో నిత్యం మీడియాలో చూస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కాళేశ్వరం నీటినితెచ్చి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షి షా, జెడ్‌పి సిఇఒ ఎల్లయ్య, ఆర్‌డిఒ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలించక విమానాల దారి మళ్లింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలు ల్యాండ్ అవ్వడానికి వాతావరణం అనుకూలించకపోవడంతో పలు విమానాలను దారి మళ్లించారు. జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం తెల్లవారుజామున తీవ్రమైన పొగ మంచు కారణంగా విమానాలను మద్రాస్ ఎయిర్‌పోర్టుకు దారి మళ్లించారు. ఇందులో 6ఇ-461 (ఇండిగో) ముంబయి-హైదరాబాద్ విమానం, దోహా - హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లాల్సిన 6ఇ- 495 విమానం, ముంబయి-హైదరాబాద్ ఎయిర్ ఇండియా ఎఐ -615 విమానాలు ఉన్నాయి.

పేద రైతుల లూటీ.. కార్పొరేట్లకు మాఫీ

పెట్టుబడిదారులకు రూ.32లక్షల కోట్ల రుణాలు రద్దు ● 29న బహిరంగసభను జయప్రదం చేయండి

మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులు డా. రవీంద్రనాథ్ ● రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద రైతులు, వ్యవసాయ కూలీలను లూటీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం రూ.లక్షల కోట్ల రుణమాఫీ చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులు యలమంచిలి రవీంద్రనాథ్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. రిజర్వ్‌బ్యాంక్ లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు రూ.32 లక్షల కోట్ల రుణాలను కార్పొరేట్లకు మాఫీ చేస్తే .. పేద రైతులకు పైసా రద్దు చేయలేదన్నారు. వ్యవసాయ కార్మికులు, పేద రైతుల సమస్యలపై చర్చించేందుకు 29-31వ తేదీ వరకు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 29వ తేదీ సాయంత్రం ఎస్‌ఆర్‌బిజిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగసభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ హాజరవుతున్నట్టు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 29న బహిరంగసభకు లక్ష మంది ప్రజానీకం తరలిరానున్నట్టు తెలిపారు. పెవిలియన్‌గ్రౌండ్ నుంచి బహిరంగసభా స్థలి వరకు వేలాది మందితో ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రదర్శనలో మూడువేల మంది రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాత్, రెండువేల మంది కళాకారులు పాల్గొంటారన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌రాఘవన్, బి వెంకట్ ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ కూలీల పనికల్పనకు పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేలా కేంద్రం చర్యలు ఉన్నాయన్నారు. రోజుకు రూ 245 చొప్పున వందరోజులు మాత్రమే పని కల్పిస్తున్న కేంద్రం దీనిలోనూ అనేక ఆంక్షలు పెడుతోందని విమర్శించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో 22% నిధుల కోత విధించినట్టు చెప్పారు. ఇప్పటికీ అనేక మందికి వ్యవసాయ కూలి లేక నగరాలు, పట్టణాలకు వచ్చి అడ్డాకూలీలుగా జీవనోపాధి పొందుతున్నారని, పనిదొరికితే సరే లేదంటే పస్తులుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ రోజువారీ వేతనం కేరళ రాష్ట్రంలో గరిష్టంగా రూ.291గా ఉందన్నారు. మన రాష్ట్రంలో క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యం రూ.2080గా ఉండగా కేరళలో ఈ ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ. 800 చెల్లిస్తున్నట్టు వివరించారు. వ్యవసాయ కూలీలు, రైతులకు అనేక వెసులుబాట్లు కల్పిస్తున్న ఆ రాష్ట్ర విధానాలను వివరించేందుకే కేరళ ముఖ్యమంత్రిని బహిరంగ సభకు ఆహ్వానించినట్టు తెలిపారు. కార్పొరేట్లకు 25పైసల లోపు వడ్డీకి రుణాలిస్తున్న కేంద్రం.. రైతుల రుణాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రయివేటుగా నూటికి రూ.ఐదుకు వడ్డీకి తెచ్చుకుని రైతులు అవస్థపడుతున్నారన్నారు.

ఈ సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వర్లు, విద్యావేత్త ఐవి రమణారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి వై విక్రమ్, పిట్టల రవి, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, యర్రా శ్రీకాంత్, ఐద్వా జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి పాల్గొన్నారు.

పట్టాలిచ్చి పొజిషన్ హద్దులు చూపించరా..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

111వ రోజుకు చేరిన గుడిసె వాసుల భూ పోరాటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దుంపాయికుంటలో పట్టాలిచ్చి పొజిషన్ హద్దులు చూపించడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని దుంపాయికుంటలో ఇళ్లు లేని నిరుపేదలకు గతంలో ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది కానీ.. వారికి పొజిషన్ హద్దురాళ్లు చూపలేదు. దాంతో వారు 111 రోజులుగా ప్లాట్లలో గుడిసెలు వేసుకొని నిరసన తెలుపుతున్నారు. మంగళవారం వారిని జాన్‌వెస్లీ కలిసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 111 రోజులుగా నిరుపేదలు నిరసన దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 1997లో ప్రభుత్వమే ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి దుంపాయి కుంటలో ప్లాట్లు ఇచ్చిందని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆ ప్లాట్లకు పొజిషన్ హద్దులు చూపించడంలో విఫలమైందన్నారు. ఆ పేదలకు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అద్దె ఇళ్లకు డబ్బుల కట్టలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో గుడిసెలు వేసుకుని ఇక్కడే ఉంటున్నారని చెప్పారు. ఇక్కడ గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ పట్టాలు, ప్లాట్ల హద్దురాళ్లు చూపాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో ఎన్ని సమస్యలు ఎదురైనా సిద్ధంగా ఉంటామని, పేదలకు ప్లాట్ల హద్దురాళ్లు చూపేవరకు ఆపేది లేదన్నారు. ఆయన వెంట సిపిఎం సీనియర్ నాయకులు మహిమూద్, నాయకులు బి.వెంకటేష్, ఎస్.అజయ్, శ్యాంసుందర్, అనంతమ్మ, శ్రీనివాసులు ఉన్నారు.

దీక్ష చేస్తున్న పేదవారితో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

పొలంలో గొర్రుగొట్టిన మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన స్వగ్రామం వరంగల్ జిల్లా పర్వతగిరిలోని సొంత పొలంలో పనులు జరుగుతుంటే చూసి, పొలంలోకి దిగి గొర్రు పట్టారు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. అనంతరం అందరితో కలిసి.. గొంతు కలిపి.. నాట్లు వేశారు.

ఉద్యానవన డిగ్రీ కోర్సుకు ఫీజు తగ్గింపు

ఏడాది ఫీజు రూ. తొమ్మిది లక్షలు

రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్రఉద్యానవన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యానవన కళాశాలలో హార్టికల్చర్ డిగ్రీ కోర్సులకు ఫీజు తగ్గించినట్టు రిజిస్ట్రార్ భగవాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కళాశాలో డ 40 సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లు ఉన్నట్టు తెలిపారు. బుధ, గురువారాల్లో నిర్వహించే ఉమ్మడి కౌన్సిలింగ్‌లో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్) హార్టీ కల్చర్ డిగ్రీ కోర్సు మొత్తానికి రూ. తొమ్మిది లక్షల ఫీజు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. సెల్ఫ్‌ఫైనాన్స్ కోటాలో సీటు కావాల్సిన విద్యార్థులు అడ్మిషన్ సమయంలో రూ 5,02,910లను **The Comptroller, PJTSAU** పేర డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) రూపములో చెల్లించాలని, అలాగే, మరో రూ రూ 47,090 నగదు రూపంలో చెల్లించాలని కోరారు. మిగిలిన రూ రూ 3,50,000లను ఏడు వాయిదాల్లో (సెమిస్టర్ల వారీగా) చెల్లించాలని పేర్కొన్నారు.

జియోతో షావోమి జట్టు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ షావోమి కొత్తగా రిలయన్స్ జియోతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. దీంతో జియో వినియోగదారులకు 'ట్రూ 5జి' అనుభవాన్ని అందిస్తోన్నట్లు పేర్కొంది. షావోమి, రెడ్ మి స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు అంతరాయం లేని ట్రూ 5జి కనెక్టివిటీని యాక్సెస్ చేసుకోవడానికి, అధిక రిజల్యూషన్ వీడియో కాల్స్ ఆస్వాదించడానికి, వారి పరికరాలలో తక్కువ-లేటెన్సీ గేమింగ్ ఆడటానికి ఈ అనుబంధం వీలు కల్పిస్తోందని పేర్కొంది. తమ సంస్థకు చెందిన పలు 5జి స్మార్ట్ ఫోన్లను రిలయన్స్ జియో ట్రూ 5జీ నెట్‌వర్క్‌తో పరీక్షించారని తెలిపింది.

సర్కారు బడికి ఎన్‌ఆర్‌ఐ రమేష్ ఇస్సంపల్లి భూ విరాళం

- మంత్రి కెటిఆర్ పిలుపుతో సహకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలకు లండన్‌కు చెందిన ఓ ఎన్‌ఆర్‌ఐ, బిఆర్‌ఎస్ నాయకుడు రమేష్‌బాబు ఇస్సంపల్లి సహకారమందించారు. ఆయన సొంతూరు మంచిర్యాల పట్టణ కేంద్రంలోని హమాలీవాడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న ఎనిమిది గుంటల భూమిని విరాళంగా ప్రకటించారు. రాష్ట్ర పురపాలక, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు పిలుపుతో స్ఫూర్తి పొంది ఆయన ఈ సహకారమందించారు. మంగళవారం ప్రగతి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుర్మాచలంతో ఆయన కలిసి అందుకు సంబంధించిన పత్రాలను రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కెటిఆర్‌కు అందజేశారు. రాష్ట్రంలోని సర్కారు బడులను ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా కార్పొరేట్ తరహాలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ 'మన ఊరు-మనబడి' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విదేశాల్లో ఉంటూ తెలంగాణ గడ్డపై చూపిస్తున్న ప్రేమ పట్ల, ఇంతటి బృహత్తరమైన కార్యక్రమంలో పాలు పంచుకున్నందుకు ఎన్‌ఆర్‌ఐ రమేష్‌ను మంత్రి కెటిఆర్ అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు. ఇటీవల లండన్‌లో పర్యటించిన కెటిఆర్ తెలంగాణ తల్లి రుణం తీర్చుకోవడానికి, రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసిరావాలంటూ ఎన్‌ఆర్‌ఐలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆ పిలుపుతో స్ఫూర్తి పొంది తనవంతు సహకారాన్ని అందించానని చెప్పారు.

కెటిఆర్‌కు భూమి పత్రాలను అందజేస్తున్న రమేష్‌బాబు

సుగంధ ద్రవ్యాల బోర్డు సభ్యునిగా ఎంపి అర్వింద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుగంధ ద్రవ్యాల బోర్డు సభ్యునిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ ఎన్నికయ్యారు. ఆయనతోపాటు వల్లభనేని బాలశౌరి కూడా సభ్యులు ఎన్నికైనట్టు పార్లమెంట్ మంగళవారం బులిటెన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎంపి అర్వింద్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన ఎనిమిది నెలల కాలంలోనే మోడీ ప్రభుత్వం నిజామాబాద్ కేంద్రంగా "రీజినల్ ఆఫీస్ కం ఎక్స్టెన్షన్ సెంటర్ " మంజూరు చేసిందని, దాని ద్వారా బోర్డు 30 కోట్ల బడ్జెట్‌ను 2022-2025 మధ్య మూడేళ్ల కాలానికి ఆమోదించిందని తెలిపారు. 1986 నుంచి 2020 వరకు 35 ఏళ్లలో రానటువంటి బడ్జెట్‌ను మూడేండ్ల కాలానికి తెచ్చుకున్నామని చెప్పారు. రూ. తొమ్మిది కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయని, బోర్డు సభ్యునిగా ఎన్నికవ్వడం పట్ల ఎంపి స్పందిస్తూ దీని వల్ల నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రాంత పసుపు రైతులకు మరింత సేవ చేసే అవకాశం లభించిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పసుపు, మిర్చి పంటల రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మరింతగా కృషి చేస్తానని పేర్కొన్నారు. బోర్డు సభ్యునిగా తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి 'రైతు బంధు'

రైతుల ఖాతాల్లో జమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు బంధు డబ్బులు... బుధవారం రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. పది విడతలుగా రైతు బంధుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70.54 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7,600 కోట్ల పంపిణీకి చర్యలు తీసుకుంది. గతంలో కంటే ఈసారి దాదాపు లక్ష మంది కొత్త రైతుల పేర్లు రైతుబంధు పథకంలో చేరాయి. ఈ ఏడాది డిసెంబర్ 20 లోపు నమోదు చేసుకున్న వారు పెట్టుబడి సాయాన్ని పొందేందుకు అర్హులని ప్రభుత్వం తెలిపింది. దీంతో కటాఫ్ తేదీ కంటే ముందే పూర్తయిన భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు సంబంధించి దరఖాస్తులు లక్షల్లో తమను అందాయని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ధరణి రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు యాసంగి రైతుబంధు పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా వర్తింపజేస్తున్నట్లు వారు తెలిపారు. 1.56 కోట్ల ఎకరాలకు రైతుబంధు సాయం అందనుంది. ఇందులో భాగంగా ఒక్కో జిల్లాలో ఎంత మంది రైతులకు పంపిణీ చేయాలనే వివరాలను ఇప్పటికే ఆర్థిక శాఖ ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులకు పంపింది. రైతు పథకం కింద రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఈ నెల 28 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

పాదయాత్ర చేస్తున్న రైతులు

- ధరణిలో రైతుల పేర్లు ఎక్కించాలి
- నిషేధిత జాబితా నుంచి భేషరతుగా తొలగించాలి
- ఆర్‌డిఒ కార్యాలయానికి నాలుగు గ్రామాల రైతుల పాదయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీని రద్దు చేయాలని, నిషేధిత జాబితా నుంచి భూములను వెంటనే తొలగించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ భూములను ధరణిలో ఎక్కించాలని కోరారు. ఫార్మాసిటీ రద్దు డిమాండ్‌తో మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నాలుగు గ్రామాల రైతులు తుర్కయంజాల్‌లోని ఆర్‌డిఒ కార్యాలయానికి పాదయాత్ర చేపట్టారు. బుధవారానికి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకోనుంది. కదం తొక్కుతూ పదం పాడుతూ పాదయాత్ర ముందుకు సాగింది. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కానమొని గణేష్, కార్యదర్శి కుందారపు నారాయణ, సలహాదారులు కౌల సరస్వతి పిలుపుమేరకు రైతులు పెద్దఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు. మేడిపల్లి, నానక్‌నగర్, కురుమిద్ద, తాడిపర్తి గ్రామాల రైతులు మేడిపల్లి మీదుగా యాచారం మండల కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దార్ సుచరితకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ పహాణీలో రైతుల పేర్లు వెంటనే నమోదు చేయాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయాలన్నారు. క్రాప్‌లోన్లు, ఇతర బ్యాంకు లోన్లు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాతావరణాన్ని కలుషితం చేసే ఫార్మాకంపెనీల ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషతుల్య ఫార్మా కంపెనీలు పెట్టి 'మా బతుకులు ఆగం చేయొద్దని' నినదించారు. మండల కేంద్రం నుంచి పాదయాత్ర రాత్రికి ఇబ్రహీంపట్నం చేరుకుంది. బుధవారం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకోనుంది. ఈ పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపిపి కొప్పు సుకన్య భాష, వైస్‌ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు పెద్దయ్య, రాజశేఖర్ రెడ్డి, దోస రమేష్, ఎంపిటిసి బాబయ్య, నాయకులు ఆలంపల్లి నరసింహ, మాజీ సర్పంచ్ ముత్యాల వెంకటరెడ్డి, మరుపల్లి అంజయ్య, ముచ్చర్ల సంపత్, మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం మద్దతు తెలిపారు. రైతులతోపాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఫార్మాసిటీని వెనక్కి తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బిఆర్‌ఎస్‌కు 18 మంది ఆదివాసీ సర్పంచ్‌ల రాజీనామా

నిధుల్లేక అభివృద్ధి చేయలేకపోతున్నామంటూ ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన ఆదివాసీ సర్పంచ్‌లు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. మండల కేంద్రంలోని పాత ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. చౌప్పన్‌గూడ సర్పంచ్ అన్నిగ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ అవి సక్రమంగా అమలు జరగడంలేదన్నారు. తాము సర్పంచ్‌లుగా 2019లో ఎన్నికయ్యాక కొన్ని నెలలే నిధుల కొరత లేకుండా పరిపాలన సాగించామని చెప్పారు. 2021 నుంచి నేటి వరకు నిధుల్లేక గ్రామ పంచాయతీలో పాలనా వ్యవస్థ సక్రమంగా కొనసాగించలేకపోతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు సక్రమంగా రావడం లేదని, వచ్చిన నిధులనూ అభివృద్ధి పనులకు వాడుకోకుండా స్వేచ్ఛ లేకుండా పోతున్నదన్నారు. పదవీకాలం చివరి దశకు వచ్చినా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించలేకపోతున్నామన్నారు. సరైన రోడ్డు, నీటి సౌకర్యం లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయనీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి అనేకసార్లు సమస్యలను వివరించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమపట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నారనీ, పేదవారికి ఇండ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు మండలంలో ఇవ్వడం లేదన్నారు. అభివృద్ధి చేయలేకపోతున్నామని, గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు తమను నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే తామంతా మూకుమ్మడిగా 18 మంది సర్పంచులం బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తూ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పకు వాట్సాప్ ద్వారా సమాచారం పంపించామని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో కొట్నాకె కిష్టు (పాటగూడ), సిడాం అన్నిగ (చౌప్పన్‌గూడ), కొర్కటె దేవ్‌రావు (సవాతి), కొర్వెత జంగు (చిచ్చుపెల్లి), సిడ్మెక దౌలత్ (గోయగావ్), జుగునాకె మనోహర్ (వెల్గీ), పెందూర్ పవన్ (కమాన), అడ జయరాం (నవెదరి), మడావి లింగుబాయి (దొడ్డిగూడ), సెడ్మకె గంగారాం (కిర్డీ), మడావి బాలు (నవెగాం), మడావి రేణుక (నవెగూడ), కొట్నాక సుమిత్ర (డాబా), కినుక గంగుబాయి (సోనాపూర్), పెందూర్ సుగంధ (కన్నర్‌గావ్), రాయిసిడాం మంగళాబాయి (కోమటిగూడ), ముక్కినేని పోశక్క (జంబుల్‌దరి), తాటి కుమారి (లెండిగూడ) ఉన్నారు.

రాజీనామా చేస్తున్న ఆదివాసీ సర్పంచ్‌లు

మహారాజశ్రీ విజయనగరం ఫేమలీ కోర్టు జడ్జి మరియు అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

IA 781/2022 OS 19/2021

Between :
Sagi Satyanarayana Raju ....Petitioner
And:
Gorusu Malleswari and others
.....Respondetns

Notice to R-4

Talluru Ravi Prasad, S/o Ramanaidh Naidu, Flot No.H-4, Trendset Ventage, Road No.14, Banjara Hills, Hyderabad - 500034

పై నెంబరు పిటిషను IA 781/2022లో మీకు అనేకసార్లు పై కోర్టువారి నుండి పంపగా మీరు తీసుకోనందున సదరు పిటిషను **తే 19-1-2023దీ**కి వాయిదా ఉన్నది. సదరు పిటిషను IA 781/2022లో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 19-1-2023దీన ఉదయం 10-30 గం॥**లకు మీరు పై కోర్టులో హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషను మీ పరోక్షమందు తీర్మాణించడమగును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram-2,
Cell No.9441053628

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GUDIWADA
I.A. NO. 261/2022 IN O.S. NO. 117/2008

Between :
1. Tandra Taruni Latha
2. Runjala Anupama Jyothi
3. kakollu Balaji Kumar

... Petitioners / Plaintiffs

And
1. Kakollu Madhusudhana Rao
2. Kakollu Yugandhara Rao
3. Velisala Lakshmi Prabha
4. Kante Harathi
5. Kakollu Vijaya Kumari.

... Respondents / Defendants

Respondent No.2 : Kakollu Yugandhara Rao, S/o Late Babu Ravindra Rao, D.No. 626/P, site-2, N.R.R. Puram, Borabonda, Yerragadda, Hyderabad-18.
Respondent No.3 : Velisala Lakshmi Prabha, W/o Prasad, D/o. K.Babu Ravindra Rao, D.No. 8-4-369/201/A, Swarajya Nagar, Borabanda Yerragadda, Hyderabad-18.
Respondent No.4 : Kante Harathi, W/o Ramesh, D/o Late K.Babu Ravindra Rao, R/o D.No. 45-10-5, Padavalarevu, Gunadala, Vijayawada-4. NTR District,A.P.

The above Petition filed by the Petitioner against Respondents and same is posted for service of Notices to the Respondents No.2 to 4, and same is posted as 18-01-2023 for the appearence of Repondent No.2 to 4.

If the Respondent No.2 to 4 are having any objection in the above matter. They should appear before the above said court on 18-01-2023 at 10.30 am. either person or through your counsel failing which Hon'ble court was pleased to pass exparty orders against respondent no.2 to 4 of you.

(By court Order)

Gudiwada
Dt. 27-12-2022

Advocate for Petitioners / Plaintiffs
Penumala Rambabu,
R.Ravikumar,
Advocate & Notary,
D.No. 23-39-42A,
Satyanarayanapuram,
Vijayawada-520011.

భూ తగాదాలతో హత్యలు, ఆత్మహత్యలు

మహేష్‌కుమార్ గౌడ్ ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణి వెబ్ పోర్టల్‌లో ఉన్న లోపాలతో రాష్ట్రంలో భూ తగాదాలు పెరుగుతున్నాయనీ, దీంతో హత్యలు, ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కైలాష్ నేత, చరణ్ యాదవ్, పవన్ మల్లాదితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఆ ప్రాజెక్టు నుంచి ఎకరాకు నీళ్లు ఇవ్వాలంటే రూ. 40 వేలు విద్యుత్ బిల్లు అవుతుందన్నారు. అలాంటి ప్రాజెక్టును ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. ధరణి, ఇతర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కొంత మంది ప్రభుత్వ అధికారులు కెసిఆర్ తొత్తులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో, లిక్కర్ కుంభకోణంలో కూడా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని కోరారు. ఇప్పటికే బిజెపి, బిఆర్ఎస్ విషయములో అనుమానం ఉందని పేర్కొన్నారు.

అక్రమ బ్యాంకు రుణాలపై చర్యలు తీసుకోండి

ఆర్‌బిఐ గవర్నర్‌కు జడ్సన్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థలు బ్యాంకుల నుంచి అక్రమంగా రుణాలు తీసుకుంటున్నాయని ఎఐసిసి సభ్యులు బక్క జడ్సన్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆర్‌బిఐ గవర్నర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సెక్యూరిటీ బాండ్ల రూపంలో రూ 45,000 కోట్ల రుణాన్ని తీసుకున్నప్పటికీ, అది బడ్జెట్‌లో చూపించలేదని గుర్తు చేశారు. ఆర్‌టిసి, కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఇలా అనేక సంస్థలు రుణాలు తీసుకున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా రుణాలు తీసుకుని రాష్ట్ర ప్రజలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

'హాత్ సే హాత్' జోడో రాష్ట్ర పరిశీలకుడిగా గిరిష్ చోడాంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐసిసి తలపెట్టిన హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడిగా గిరిష్ జోడాంకర్‌ను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంపిఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు 26 రాష్ట్రాలకు పరిశీలకులను నియమించింది. ఈమేరకు మంగళవారం పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వండర్‌లాలో కొత్త ఏడాది వేడుక

ప్రజాశక్తి-హైదరాబాద్

అమ్యూజ్‌మెంట్ పార్క్ చైన్ వండర్‌లా హాలీడేస్ తన హైదరాబాద్‌లోని పార్క్‌లో 2023 సంవత్సరానికి స్వాగతం చెబుతూ సన్‌బర్న్ రీలోడ్ ఎన్‌వైఇను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. డిసెంబర్ 31న రాత్రి 8.30 గంటల నుంచి ఈ వేడుక ప్రారంభం అవుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఇటాలియన్ సెన్సేషన్ జియాన్ నోబిలీ, డైనమిక్ డిజె, మ్యూజిక్, డ్యాన్స్ తదితర ఉంటాయని తెలిపింది.

ఫ్రెష్ టు హోమ్‌కు నిమిషానికి 68 ఆర్డర్లు

ప్రజాశక్తి- హైదరాబాద్

చికెన్, మటన్, చేపలు తదితర మాంసం ఉత్పత్తులను విక్రయించే ఇ-కామర్స్ వేదిక ఫ్రెష్‌టుహోమ్ నిమిషానికి 68 ఆర్డర్లను పొందుతున్నట్లు ప్రకటించింది. 2022లో మొత్తంగా 3.6 కోట్ల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు పేర్కొంది. బెంగళూర్ నుంచి అధిక ఆర్డర్లు దక్కినట్లు తెలిపింది. ఈ సంస్థ దేశంలోని హైదరాబాద్ సహా 190 నగరాల్లో కార్యకలాపాలను కలిగి ఉంది.

ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?

మున్నూరు కాపుల గ్రామబహిష్కరణపై మల్లు రవి ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్నూరు కాపుల పట్ల ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా? అంటూ పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి విడిఎలను ప్రశ్నించారు. బిసి కుటుంబాలను బహిష్కరిస్తారా? అని నిలదీశారు. నిజామాబాద్ జిల్లాలో షాపూర్ గ్రామంలో 80 మంది మున్నూరు కాపు కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేయడం అత్యంత దారుణమనీ, వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంకా గ్రామాల్లో ఇంత దారుణమైన వివక్ష ఉందనీ, అసలు రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన ఉందా? లేక రాచరికమా? నియంత పాలన సాగుతున్నదా? అని ప్రశ్నించారు.

కలెక్టర్‌కు లేఖ

మున్నూరు కాపులను గ్రామ బహిష్కరణ చేసిన విడిఎలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత, మున్నూరు కాపు యువక మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ క్రాంతికుమార్ కోరారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఆయన లేఖ రాశారు. దేశమంతా ఆజాదీకా అమృత్ మహోత్సవం జరుపుకుంటున్న సమయంలో గ్రామాల్లో ఇలా సాంఘిక బహిష్కరణ చేయడం ఆవేదన కలిగిస్తున్నదని పేర్కొన్నారు.

శ్రమజీవులు కదలండోయ్..!

- రేపు ఖమ్మంలో వ్యవసాయ కార్మిక సంఘం బహిరంగసభ
- అరుణారుణ తోరణాలు.. ఫ్లెక్సీలతో ఎరుపెక్కిన నగరం
- ముస్తాబవుతున్న ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కాలేజీ మైదానం
- హాజరుకానున్న కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం ఎరుపుమయం అయింది. ఎటుచూసినా అరుణారుణ తోరణాలు, ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో భాగంగా 29వ తేదీ సాయంత్రం ఖమ్మంలో బహిరంగసభ నిర్వహించేందుకు సంఘం బాధ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ హాజరవుతున్నారు. సుమారు లక్ష మంది వరకు సభకు రావచ్చని అంచనా వేస్తున్నారు. దానికి తగిన విధంగా సభా స్థలి ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. సభా ఏర్పాట్లను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం, వ్యవసాయ కార్మికసంఘం, రైతుసంఘం నేతలతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఊళ్లన్నీ కదలనున్నాయ్..

వ్యవసాయ కార్మిక సంఘం నేతల పిలుపునందుకుని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ తదితర చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ఆదివాసీ బిడ్డలు గురువారం ఖమ్మంలో నిర్వహించే బహిరంగసభకు దండుగా కదిలి వచ్చేందుకు సిద్ధమయ్యారు. మూడువేలకు పైగా లారీలు, బస్సులు, వ్యాన్‌లను ఇప్పటికే ప్రాంతాల వారీగా స్వచ్ఛందంగా సిద్ధం చేసుకున్నారు. ఈ బహిరంగ సభకు కేరళ సిఎం విజయన్ వస్తుండటంతో.. ఆ రాష్ట్రంలో వ్యవసాయదారులు, కూలీల కోసం అమలవుతున్న పథకాలు, పర్యవసానాలు, ఫలితాలు తెలుసుకోవాలని ఊరూరా జనం కదిలేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రతి ఊళ్లో ప్రచార రథాలు చెమటచుక్కల ప్రాధాన్యం తెలుపుతూ.. కష్టజీవుల కష్టాన్ని దోచుకుంటున్న ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ.. పాటల పరవళ్లతో బహిరంగ సభ కోసం ప్రచారం నిర్వహిస్తున్నాయి. భక్త రామదాసు కళాక్షేత్రంలో 31వ తేదీ వరకు నిర్వహించే మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 700 మంది ప్రతినిధులు రానున్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌రాఘవన్, బి వెంకట్ మహాసభలో ప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు. అటు బహిరంగసభకు, ఇటు మహాసభకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

ఎరుపెక్కిన ఖమ్మం..

బహిరంగసభ కోసం ఖమ్మం నగరాన్ని అరుణతోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరించారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి మొదలు కోదాడ క్రాస్‌రోడ్, వరంగల్ ఎక్స్ రోడ్, కాల్వొడ్డు, త్రీటౌన్‌లోని గాంధీచౌక్, మార్కెట్ పరిసరాలు, ముస్తఫానగర్ చౌరస్తా, ఇటు పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, మయూరిసెంటర్, సరితా క్లీనిక్ సెంటర్, జడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ఎన్‌టిఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ ఇలా ఎటుచూసినా అరుణారుణ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి.

కవాత్ వీరులు.. కళాకారులు..

వ్యవసాయ కార్మికసంఘం బహిరంగ, మహాసభ సందర్భంగా గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖమ్మం పెవిలియన్‌గ్రౌండ్ నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ ప్రదర్శన కోసం మూడువేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్లు ఖాకీ పాయింట్, ఎర్రచొక్కాలు, ఎర్ర టోపీ, బూట్లు ధరించి 'ఏక్ దో ఏక్' అంటూ నగర వీధుల్లో కదం తొక్కనున్నారు. వీరిని అనుసరిస్తూ మరో రెండువేల మంది కళాకారులు, ఎర్రచీరలు ధరించిన నారీమణులు ఆటపాటలతో అలరించనున్నారు. బహిరంగసభ ప్రాంగణం ప్రవేశద్వారం మొదలు సభా స్థలి వరకు కేరళ సీఎంకు వీరంతా ప్రత్యేక స్వాగతం పలుకుతారు. మొత్తమ్మీద పోరు ఖమ్మం.. గురువారం కష్టజీవుల గుమ్మంగా మారనుంది.

సంపుటి ఆవిష్కరిస్తున్న వక్తలు

మాతృభాషను ప్రేమించాలి

ప్రజాశక్తి - కల్చరల్

మాతృభాషను ప్రేమించాలని పర భాషను ఆదరించాలని గుజరాత్ ప్రగతి సమాజ్ కార్యదర్శి జజ్ఞేష్ దోషి అన్నారు శ్రీత్యాగరాయ గాన సభలోని కళాలలిత వేదికపై గుజరాత్ ప్రగతి సమాజ్, మానస ఆర్ట్స్ నిర్వహణలో డాక్టర్ అంబల్ల జనార్ధన్ రచించిన తెలుగు కథలు గుజరాతి అనువాదం యంబయిని ఛత్ర ఛాయమా సంపుటి అవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా దోషి పాల్గొని సంపుటిని అవిస్కరించి మాట్లాడారు. గుజరాతీయులు హైదరాబాద్‌లో ఉన్నవారి భాషతోపాటు తెలుగును నేర్చుకొంటుంన్నారని జనార్దన్ రాసిన కథలల్లో గుజరాతీయులు జీవన విధానం ఉందని వివరించారు. న్యాయవాది డాక్టర్ హెచ్‌సి ఉపాధ్యాయ అధ్యక్షత వహించిన సభలో మానస అధ్యక్షుడు బి రామచంద్రరావు పాల్గొనగా కార్య దర్శి రఘుశ్రీ నివేదిక సమర్పించారు.

వైద్య విద్యలో అనుబంధ కోర్సులు

- తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 12 రకాల కోర్సులు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తొలిసారిగా వైద్య విద్య అనుబంధ కోర్సులను తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించబోతోంది. మొత్తం తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో బిఎస్సీ అనుబంధ కోర్సులు ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గాంధీ, కాకతీయ, రిమ్స్, ఉస్మానియా, నిజామాబాద్, సిద్ధిపేట, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఈ కోర్సులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలతో పాటు, వైద్య విద్యను అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 12 మెడికల్ కాలేజీలు ప్రారంభించగా, మరో రెండేండ్లలో జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య విద్య అనుబంధ సేవలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీఎస్సీ మొదటి సంవత్సరంలో, 12 వైద్య విద్య అనుబంధ కోర్సులు ప్రారంభించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రస్తుత విద్యా సంవత్సరం (2022-23) నుంచే ఈ కోర్సులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మూడేళ్ల కోర్సు, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్‌తో కలుపుకుని నాలుగేళ్ల కాల వ్యవధి ఉంటుంది.

అనస్తీషియా, ఆపరేషన్ థియేటర్, రెస్పిరేటరీ థెరపీ, రీనల్ డయాలసిస్, న్యూరోసైన్స్, క్రిటికల్ కేర్, రేడియాలజీ అండ్ ఇమేజింగ్, ఆడియాలజీ అండ్ స్పీచ్ థెరపీ, మెడికల్ రికార్డ్స్ సైన్సెస్, ఆప్టోమెట్రిక్, కార్డియాక్ అండ్ కార్డియోవాస్క్యులార్ టెక్నాలజీ కోర్సులు ఇందులో ఉన్నాయి. తాజా నిర్ణయం వల్ల ప్రతి సంవత్సరం 860 మంది లబ్ది పొందుతారు. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగు పడనున్నాయి.

విద్యలో తెలంగాణ అగ్రగామి

ఎనిమిదేళ్లుగా కేంద్రం నిర్లక్ష్యం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహకరించకున్నా.... విద్యా వ్యవస్థలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని బిఆర్ఎస్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ట్వీట్ చేశారు. ఎనిమిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నప్పటికీ సిఎం కెసిఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తోందని తెలిపారు. బాలికల విద్యకు తెలంగాణ స్వర్ణ యుగంగా మారిందని తెలిపారు. పీజీలో 72 శాతం,డిగ్రీలో 52 శాతం, గురుకులాలు, కెజిబివిల్లో 69 శాతం, బిఇడి ఫస్టియర్‌లో 81 శాతం బాలికల అడ్మిషన్లతో, ఉన్నత విద్యలో బాలికల ఎన్‌రోల‌మెంట్ రేషియోలో జాతీయ సగటును మించిన రాష్ట్రం మంచి ఫలితాలను సాధిస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల కేటాయింపులోనూ కేంద్రం తెలంగాణ పట్ల పూర్తి కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. అయినా వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. కొత్త విద్యాసంస్థల ఏర్పాటు,మౌలిక వసతుల కల్పనతో, ఉన్నత విద్యలో బాలికలు పెద్ద ఎత్తున చేరుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు.

సిలబస్‌లో మత గ్రంథాలను చేర్చొద్దు

వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన విద్యావిధానంలో భాగంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) సిలబస్‌లో ఆరు, ఏడు తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాల్లో భగవద్గీతను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేర్చాలన్న నిర్ణయం సరైంది కాదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్‌లో కొన్ని శ్లోకాలను, 11, 12 తరగతుల్లో సంస్కృతం పాఠ్యాంశాల్లో భగవద్గీతను చేర్చడమంటే విద్యను కాషాయికరణ చేయడమేనిని విమర్శించారు. విద్య అనేది సమాజానికి ఉపయోగపడి మానవ వనరులను అభివృద్ధి చేసేదిగా ఉండాలి తప్ప మతం పేరుతో సమాజాన్ని చీల్చేందుకు ఉపయోగపడకూడదని తెలిపారు. విద్యలో మత గ్రంథాలను తీసుకుని రావడమంటే రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. శాస్త్రీయ విద్యా విధానంతోనే శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతాయని, అంతే తప్ప మత గ్రంథాలు మూలంగా కాదని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో భగవద్గీతను ప్రవేశ పెట్టడాన్ని వెనక్కి తీసుకోవాలని, శాస్త్రీయ విద్యను అందించాలని డిమాండ్ చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు విద్యారంగంలోకి తీసుకురాకుండా విద్యార్థులు పోరాడాలని వారు పిలుపునిచ్చారు.

అన్‌టైడ్ గ్రాంట్లు వినియోగించుకోవచ్చు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం -2018 ప్రకారం గ్రామ పంచాయతీలకు సంబంధిత బిల్లుల చెల్లింపునకు అన్‌టైడ్ గ్రాంటులను వినియోగించవచ్చునని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామపంచాయతీలను బలోపేతం చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటికి సమానమైన నిధులను గ్రామ పంచాయతీలకు రెగ్యులర్‌గా విడుదల చేసినట్టు పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తుందనీ, వాటిని గ్రామ పంచాయతీ ఖాతాలకు రాష్ట్రప్రభుత్వం విడుదల చేస్తోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేయదని స్పష్టంచేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి టైడ్ కాంపోనెంట్‌ను పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు వినియోగించవచ్చునని తెలిపారు. అలాగే అన్‌టైడ్ గ్రాంటులను గ్రామ పంచాయతీకి ఉన్న అధికారాల మేరకు ఖర్చు చేయవచ్చునని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా నిర్దిష్ట ఖర్చులను బుక్ చేశాయని వివరించారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంటులు విడుదలైన వెంటనే పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా పెండింగులో ఉన్న బిల్లుల చెల్లింపునకు బుక్ చేయాలని అన్ని గ్రామ పంచాయతీలకు సూచించినట్టు తెలిపారు. ఆ గ్రాంట్‌ను నిబంధనల ప్రకారం వినియోగిస్తామని పేర్కొన్నారు.

మంచి, చెడులకు వెళ్లొద్దు

- అతిక్రమిస్తే రూ.పది వేల జరిమానా
- 80 మున్నూరు కాపుల కుటుంబాలపై బహిష్కరణ
- స్కూల్ పిల్లలను ఆటోల్లో ఎక్కించుకోకుండా ఆంక్షలు
- శాపూర్ విడిసి దాష్టీకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విడిసి ఆగడాలకు అడ్డాగా ఉన్న ఆర్మూర్ డివిజన్‌లో.. తాజాగా మరో దాష్టీకం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం శాపూర్ గ్రామంలో 80 మున్నూరు కాపు కుటుంబాలను బహిష్కరిస్తూ విడిసి చాటింపు వేయించింది. మున్నూరు కాపులు మంచి, చెడులకు వెళ్లొద్దని, మాదిగలు డప్పులు కొట్టరాదని, రజకులు బట్టలు ఉతకరాదని, నాయీ బ్రాహ్మణులు వెంట్రుకలు, గడ్డం తీయరాదంటూ ఆంక్షలు విధించింది. అతిక్రమించిన వారికి రూ. పది వేల జరిమానా విధిస్తామని విడిసి సభ్యులు తీర్మానించారు. ఆటోలో నందిపేట్ వరకు మున్నూరు కాపులను ఎక్కించుకోకూడదని చాటింపు వేయించారు.

వివరాల్లోకి వెళ్తే.. నందిపేట్ మండలం శాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇల్లు కట్టారు. తమను సంప్రదించకుండానే ఇల్లు కట్టుకుంటారా అంటూ విడిసి ఆమెపై ఆంక్షలు విధించింది. ఆమెకు ఎవరూ ఎలాంటి సహకారం చేయవద్దని గతంలో హుకుం జారీ చేసింది. అయితే, అదే గ్రామానికి చెందిన ముప్పడి గంగాధర్ ఆమెకు కరెంటు మీటరు విషయంలో సహాయం చేశాడు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులను పిలిచి పంచాయితీ పెట్టించారు. వారికి రూ.1.10 లక్షల జరిమానా విధించగా, విధిలేక చెల్లించారు. అయితే, మూడు నెలల్లోగా ఆమె నుంచి మీటర్ తిరిగి ఇప్పిస్తామని విడిసి సభ్యులు ఒప్పందం రాసి ఇచ్చారు. అనంతరం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. ఒప్పందం ప్రకారం తన మీటర్ తనకు ఇవ్వకపోవడంతో మీటర్ ఇవ్వాలని విడిసిని సంప్రదించాడు. ఇప్పటి వరకు పంచాయితీల కోసం కూర్చున్నప్పుడు సుమారు 80 వేల రూపాయల వరకు ఖర్చు అయిందని, ఆ డబ్బులు ఇస్తేనే మీటర్ ఇస్తామని చెప్పారు. మీటర్ ఇవ్వకుంటే తాను కట్టిన డబ్బులైనా తిరిగి ఇవ్వాలని కోరినా విడిసి అంగీకరించలేదు. దాంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమపై ఎదురుదాడి చేస్తావా? అంటూ విడిసి సభ్యులు ఆయనపైనే కాకుండా ఆయన సామాజిక తరగతి మున్నూరుకాపునకు చెందిన మొత్తం 80 కుటుంబాలపై సాంఘిక బహిష్కరణ చేస్తూ తీర్మానించారు. రూ.రెండు లక్షలు చెల్లిస్తేనే తమతో కలుపుకుంటామని, లేనిపక్షంలో ఆంక్షలు తప్పవని హెచ్చరికలు చేశారు. ఎవరు ఎలాంటి సహకారం చేసినా, వారితో మాట్లాడినా రూ.పది వేల జరిమానా విధిస్తామని చాటింపు వేయించారు. వారి పొలాల్లో పనులకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. నందిపేట్‌లో స్కూల్‌కు వెళ్లే పిల్లలను సైతం తమ ఆటోల్లో ఎక్కించుకోవద్దని ఆటోడ్రైవర్‌లకు హుకుం జారీ చేశారు. దీంతో బాధిత కుటుంబాలు తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు విడిసి సభ్యులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే మంచి రచయితలవుతారు

సాంఘిక సంక్షేమ శాఖామంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులను ప్రోత్సహిస్తే రాబోవు తరానికి మంచి కవులు, రచయితలు అవుతారని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో కొనసాగుతున్న 35వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రచించిన ఎనిమిది పుస్తకాలు నాట్యమయూరి, మదిలో నదిలా, చిన్ని తల్లి కోరిక, అనోఖే కిస్సే, మట్టిలో మాణిక్యం, స్వేచ్ఛ బింధువులు, ది అన్‌సీన్ రాబరీ, ఇరుకు సందుకు.. పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రచయితలు అంటే ఎక్కడ నుంచో వస్తారనే అపోహ ఉంటుందని, కానీ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో నుంచే కవులు, రచయితలు వస్తారని గురుకుల విద్యార్థులు నిరూపించారని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కృషితో గురుకుల విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల నుంచి యువ రచయితలు 17 పుస్తకాలు రాయడం ఒక విప్లవమేనన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణమని చెప్పారు. రచయితలుగా విద్యార్థుల మాటలు వింటుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. సమాజానికి వీరు మంచి సందేశాన్ని అందించేందుకు చేస్తున్న ప్రయోగం చాలా బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి రోనాల్డ్ రాస్, బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ పాల్గొన్నారు.

సెస్ చైర్మన్‌గా చిక్కాల రామారావు

ప్రకటించిన సెస్ ఎలక్షన్ అధికారి బి మమత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) చైర్మన్‌గా చిక్కాల రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్టు సెస్ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ అధికారి బి మమత మంగళవారం ప్రకటించారు. సెస్ వైస్ చైర్మన్‌గా దేవరకొండ తిరుపతి ఎన్నికైనట్టు తెలిపారు. సెస్ తంగళ్లపల్లి డైరెక్టర్‌గా చిక్కాల రామారావు గెలుపొందగా.. కోనరావుపేట డైరెక్టర్‌గా దేవరకొండ తిరుపతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మెన్, వైస్ చైర్మన్‌కు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

బహుజనులకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణం తెలంగాణలోనే...

ప్రజాశక్తి - కల్చరల్

బహుజన వర్గాలకు 41 ఆత్మ గౌరవ భవనాలకు స్థలం కేటాయించి నిర్మానానికి నిధులు మంజూరు చేయడం దేశం లో మరే రాష్ట్రం లో లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కే ఈ ఖ్యాతి దక్కుతుందని కర్ణాటక రాష్ట్ర ఎన్నికల విశ్రాంత అధికారి శ్రీనివాసాచారి కొనియాడారు.ఉప్పల్ భగాయట్‌లో మంగళవారం విశ్వ బ్రాహ్మణలకు కేటాయించి స్థలం నిర్మాణ పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బహు జనులు ఆత్మ గౌరవ భవనాలు విజ్ఞాన కేంద్రాలు గా మలచుకోవలన్నారు. దేశానికి దిక్సూచిగా ఈ భవనాలు నిలుస్తాయని పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జాలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ కెసిఆర్ బిసిల అభ్యున్నతికి చెపట్టిన పథకాలు వివరించి కర్ణాటక లోనూ విశ్వకర్మలకు తెలంగాణా ప్రభుత్వ పథకాలు తెలియ జేయలని కోరారు .భవన్ నిర్మాణ ట్రస్ట్ చైర్మన్ లాలకోట్ వెంకటచారి,కార్యదర్శి బొడ్డుపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు

పేదలకు రెన్యూపవర్ సాయం

హైదరాబాద్ : రెన్యూ పవర్ తెలంగాణ వ్యాప్తంగా 'గిఫ్ట్ వార్మ్ డ్రైవ్' పేరుతో పేదలకు సాయం చేస్తున్నట్లు ప్రకటించింది. 8వ ఎడిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆ సంస్థ ఉద్యోగులు 11 జిల్లాల్లో నిరాశ్రయులైన, ఇళ్లులేని ప్రజలకు 29,000 దుప్పట్లను అందిస్తున్నట్లు పేర్కొంది. దేశ వ్యాప్తంగా 2023 జనవరి ముగింపు వరకు పది రాష్ట్రాల్లో మొత్తంగా మూడు లక్షల దుప్పట్లను అందించనున్నట్లు తెలిపింది.

బిసిల ఆత్మగౌరవ భవనాలు విప్లవాత్మక చర్య

కర్ణాటక రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి శ్రీనివాసాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బహుజన వర్గాల ఆత్మగౌరవ భవనాలకు కోట్లాది రూపాయల విలువైన భూములను కేటాయించడాన్ని విప్లవాత్మకమైన చర్యగా కర్ణాటక రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి శ్రీనివాసాచారి అభివర్ణించారు. సిఎం కెసిఆర్ అసాధారణ నిర్ణయాన్ని ఆచరణలో చూపించారని కొనియాడారు.ఉప్పల్ భగాయత్‌లోని తెలంగాణ విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భవనాలు దేశానికే ఒక దిక్సూచిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఆత్మగౌరవ భవనాలకు 60 ఎకరాల స్థలం, రూ.90 కోట్ల బడ్జెట్ కేటాయించడం దేశంలోని బహుజన వర్గాలకు ఒక గొప్ప సందేశమని తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ బిసి కులాల వారి కోసం సిఎం కెసిఆర్ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారని, గురుకులాలను ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వకర్మ ఆత్మగౌరవ భవన ట్రస్ట్ చైర్మెన్ లాల్ కోట వెంకటాచారి, కార్యదర్శి బొడ్డుపల్లి సురేందర్, ఉపాధ్యక్షులు మదన్ మోహన్, కుందారపు గణేష్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి ఎన్ బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

8.78 లక్షల నీట్ ర్యాంకర్‌కు ఎంబిబిఎస్ సీటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యవిద్య చరిత్రలో సరికొత్త రికార్డు నమోదైంది. ఎనిమిది లక్షల 78 వేల 280 ర్యాంకు వచ్చిన తెలంగాణ విద్యార్థికి స్వరాష్ట్రంలోనే ఎంబిబిఎస్ సీటు దక్కింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎనిమిది మెడికల్ కాలేజీలతో అదనంగా 1,150 సీట్లు అందుబాటులోకి రావడం, బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకు కేటాయించడం, ఎస్‌టి రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచడం వంటి చర్యలతో ఈ సీట్లకు మార్కుల కటాఫ్ భారీగా తగ్గింది. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో రాష్ట్రంలో 42 మెడికల్ కాలేజీలు, 6,690 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక రిజర్వేషన్ లేకపోవడంతో గతేడాది బీ కేటగిరీలో 2,71,272 ర్యాంకు వరకు సీటొచ్చింది. ఈ ఏడాది రిజర్వేషన్ కల్పనతో 8,78,280 ర్యాంకు వచ్చిన విద్యార్థి సీటు దక్కించుకోగలిగారు. అదే విధంగా సీట్లు పెరగడంతో ఆయా కేటగిరీల్లో సీట్లు పొందేందుకు విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి. ఎస్‌టిల కేటగిరీలో గతేడాది 1,46,391 ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు రాగా, రిజర్వేషన్లు పది శాతం పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది 2,09,646 వరకు ర్యాంకులు పొందిన వారు ఎంబిబిఎస్ విద్యాభ్యాసం చేసేందుకు అర్హత పొందారు. సీ కేటగిరీలోనూ గతేడాది కన్నా సీట్లు పెరిగాయి. దీంతో గతంలో 9,23,789 ర్యాంకు వరకు కటాఫ్ ఉండగా, ఈ ఏడాది 10,55,181 వరకు అవకాశం లభించింది. రాష్ట్రంలో ప్రతి లక్ష మంది జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో జనాభాప్రాతిపదికన ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పీజీ సీట్ల విషయంలో రెండో స్థానంలో ఉంది.

ఆర్థికభారం నుంచి ఉపశమనం..మంత్రి హరీశ్ రావు

వైద్యవిద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో దూరదేశాల్లో పరిచయం లేని భాషలో వైద్యవిద్యను అభ్యసించే కష్టం విద్యార్థుల నుంచి దూరమవుతోందని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలు ఆరోగ్య తెలంగాణ లక్ష్యాన్ని చేరువ చేశాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.